

లక్షా 20 వేల మంది పుణ్యస్నానాలు

అంతర్వేది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సుమారు లక్షా 20 వేల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు అంచనా వేశామని ఆలయ సహాయ కమిషనర్, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. గురువారం స్వామివారి తెప్పోత్సవం సందర్భంగా అమలాపురం ఏఎస్పీ ఏవీపీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ బందోబస్తు, కోనేరు వద్ద బారీ కేడింగ్ ఏర్పాట్లను పరిశీలించారని చెప్పారు..



వైభవంగా చక్రస్నానం

అంతర్వేది భక్తజన సంద్రమైంది.. స్వామిని కన్నులారా చూసేందుకు.. స్వామి వెంట నడిచేందుకు బుధవారం వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. స్వామి వెంట నడిచారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. గరుడ పుష్పక వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. స్వామితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు - వివరాలు 6లో

క్వాయర్ ఇండస్ట్రీస్‌ను సక్రమంగా నిర్వహించాలి

చొప్పెల్లలో ఇండస్ట్రీని పరిశీలించిన కలెక్టర్ మహేష్‌కుమార్



పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆలమూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రాయితీపై ఏర్పాటు చేసిన క్వాయర్ ఇండస్ట్రీస్‌ను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్లలో కేంద్ర ప్రభుత్వ రాయితీపై ఏర్పాటు చేసిన కడియపులంక క్వాయర్ పరిశ్రమను బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్, పరిశ్రమల శాఖ కాకినాడ జనరల్ మేనేజర్ పీకేవీ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.శివరామ్‌ప్రసాద్ పరిశీలించారు. క్వాయర్ రూ.4.50 కోట్లు రుణంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని దీనిలో 90 శాతం రాయితీగా ఉందని అయితే రెండేళ్లుగా ఈ పరిశ్రమ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంపై కలెక్టర్ మహేష్ కుమార్ నిర్వాహకులను ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలతో పరిశ్రమలో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయలేకపోయామని దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి కేరళకు ప్రత్యేక బృందాన్ని పంపించామని త్వరలోనే పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసే విధంగా చర్యలు చేపడతామని నిర్వాహకులు వివరించారు. కొబ్బరి డొక్క అధికంగా దొరికే ప్రాంతమైన కోనసీమలో పలు ప్రాంతాలలో క్వాయర్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. పరిశ్రమలను అందుబాటులోనికి తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, ఉద్యానవన శాఖ అధికారి కోటేశ్వరరావు, కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



చేతిలో సస్యరక్షణ

చీడపీడల నివారణకు యాప్



యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న రైతులు

- ఇక...ప్రతి రైతుకు స్మార్ట్ ఫోన్ కావాల్సిందే!
- రైతు చేతిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు
- రైతుల ఫోన్‌లోకి ఎన్‌పీఎస్ఎస్ యాప్
- రైతే స్వయంగా చీడపీడలను గుర్తించవచ్చు
- రైతుల మొబైల్ ఫోన్‌లలోకి యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

పి.గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం. అయితే ప్రతి ఏడాది వివిధ రకాల తెగుళ్లు, వ్యాధులు పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు విచ్చలవిడిగా రసాయనిక పురుగు మందులను ఉపయోగిస్తున్నారు. ఈ రసాయనిక పురుగు మందులు వాడకం వల్ల కలిగే నష్టాలు అనేకం ఉన్నాయి. జల, వాయు, భూకాలుష్యం తద్వారా పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. జంతువులు, పక్షుల్లో, మనుషుల్లో కలిగే అనారోగ్యాలతో పాటు, చీడల్లో పురుగు మందుల నిరోధకత పెరుగుతోంది. చీడ, పీడలు, సమగ్ర పురుగు మందులు వాడకం గురించి రైతులకు సరైన సమాచారం లేకపోవడం వలన వారు సస్యరక్షణ సమాచారం కోసం పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏఐ ఆధారిత మొబైల్ వెబ్ పోర్టర్‌ను ఆవిష్కరించింది. తాజాగా గతేడాది డిసెంబర్ నుంచి కూటమి ప్రభుత్వం ఏపీలోని రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.



మొబైల్‌కు యాప్ అప్‌లోడ్..

ఇప్పటికే జిల్లాలోని ఏడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 455 రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు ఈ యాప్‌పై ఉన్నతాధికారులు డివిజన్ల వారీగా శిక్షణ అందించారు. ప్రస్తుతం గ్రామాల్లో సంబంధిత సిబ్బంది స్మార్ట్ ఫోన్‌లు అందుబాటులో ఉన్న రైతులకు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి పనితీరు, ఉపయోగాలను వివరిస్తున్నారు.

ఫొటోను అప్‌లోడ్ చేస్తే చాలు

పంటను ఆశించే పురుగు ఫొటోను అప్‌లోడ్ చేస్తే ఆ పురుగు స్వరూపం, తీవ్రత, ఏ పంటను ఎక్కువగా ఆశిస్తుంది. దాని వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలను సూచిస్తుంది. రెండో అంశంలో మన పంటకు ఆశించిన పురుగును ఫొటో తీసి అప్‌లోడ్ చేసి రైతు పేరు, పంట విస్తీర్ణం, రకం తదితర అంశాలను పొందుపరిస్తే ఎరువులు, ఏ రకమైన పురుగు మందులు ఎంతమేర వాడాలో రైతుకు సూచిస్తుంది. అయితే రాబోయే రోజుల్లో పైన సూచించిన అంశాలన్ని దశలు వారీగా ఈ యాప్‌లో తెగుళ్లు, సమగ్ర సస్యరక్షణ తదితర అంశాలు పూర్తిస్థాయిలో ఉంటాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ యాప్ ఇంగ్లీషు, హిందీ భాషల్లో మాత్రమే ఉంది. కానీ ఏపీలో రైతులకు ఉపయోగపడాలంటే తెలుగు భాషలోకి రావాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే యాప్ తెలుగు భాషలోకి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రైతుల్లో ఎక్కువ శాతం స్మార్ట్ ఫోన్‌లు వినియోగించకపోవడంతో పాటు అవగాహన లేకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే ఈ యాప్ ఎంతవరకు ఉపయోగపడుతుందో వేచి చూడాలి. అంతే కాకుండా ప్రభుత్వం రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రావాలని పదేపదే ప్రకటనలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో ఈ యాప్‌లో కూడా సేంద్రియ ఎరువుల వాడకాన్ని పొందుపరుస్తారా లేదా అనే అంశం కూడా రైతుల్లో ప్రస్తావనకు వస్తోంది..

రైతులకు ఎన్నో ప్రయోజనాలు

రైతులు తమ పొలాల్లో చీడ పీడలను త్వరగా గుర్తించి వాటి నివారణకు సత్వర సలహాలు, సూచనలు అందించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వ భారత వ్యవసాయ శాఖ పరిధిలోని మొక్కల సంరక్షణ తనిఖీ నిల్వల సంచాలక కార్యాలయ పీపీక్యూఎస్ ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ ఆధారిత యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వినూత్న మొబైల్ యాప్ ద్వారా రైతులకు పంటల్లో చీడ పీడల యాజమాన్యం గురించి ఖచ్చితమైన పూర్తి సమాచారాన్ని శాస్త్రవేత్తలు అందించిన సలహాలు ద్వారా పొందుతారు. ఈ యాప్‌లో పురుగులు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా రైతులు తమ పొలంలో చీడ పీడల తెగుళ్లను మొబైల్ ద్వారా గుర్తించగల్గుతారు. అంతేకాకుండా 15 ప్రధాన పంటలకు సంబంధించి కీలక వ్యాధులను సకాలంలో ఎదుర్కొనేందుకు సరైన సలహాలు పొందుతారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్ సహాయంతో రైతులు తమ స్మార్ట్ ఫోన్ సాయంతో తమ పంట పొలంలో చీడ పీడలు ఫొటోలు తీసి ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేసిన వెంటనే ఆ పురుగు తెగులను త్వరగా గుర్తించడమే కాకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలను సూచిస్తుంది. అదే విధంగా రైతులకు అందుబాటులో ఉన్న 15 రకాల ముఖ్య పంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారం వంటి అంచనా సమాచారం అందించగానే ఉధృతి తగ్గట్టుగానే చీడ పీడల నివారణ చర్యలను ఈ యాప్ సూచిస్తోంది. ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ ద్వారా ఏ వ్యాధి, ఏ కీటకము హానికరం లేదా ప్రయోజనకరం అనేది తెలుసుకోవచ్చు. దాని క్రిమిసంహారక మందులను ఏ పరిమాణంలో ఏ సమయంలో ఎంత వాడాలి అనే సమాచారాన్ని పొందవచ్చు. ఈ యాప్ చేసిన సూచనలలో.. క్రిమిసంహారకాల కంటే ముందుగా సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ మొబైల్ యాప్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న తెగుళ్ల సమగ్ర వీక్షణ విశ్లేషణ సాధ్యమవుతుంది. రైతులకు సకాలంలో చీడ పీడలు, తెగుళ్ల నివారణకు సత్వర సమాచారాన్ని అందించి పంట నష్టాన్ని నివారించడం తద్వారా మొక్కల్లో తెగుళ్ల వ్యాప్తిని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరకుండా అరికట్టవచ్చు. ఈ యాప్ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి మొక్కల సంరక్షణ యంత్రాంగాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉంచుతుంది. సమగ్ర సస్యరక్షణ యంత్రాంగాన్ని పటిష్టపరిచి వ్యవసాయ, ఉద్యాన పంటల్లో చీడపీడల వ్యాప్తిని నిరోధిస్తుంది. అంతే కాకుండా రాబోయే రోజుల్లో పంటల సంరక్షణకు ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి సహాయపడుతుంది.



పులి.. చిక్కేనా!

పులుల కేరాఫ్ పాపికొండలు

అసలు ఉభయగోదావరి జిల్లాల్లో పులులు ఎన్ని ఉన్నాయి..? పులులా అవెక్కడుంటాయి..! మన జిల్లాల్లో అసలు పులులు లేవనేది చాలామంది వాదన. ఇది నిజం కాదు.. మన జిల్లాల్లోనూ పులులు ఉన్నాయి.. ఎక్కడో తెలుసా పాపికొండల అభయారణ్యంలో.. ఆ లెక్క ఎలా అంటారా.. నాలుగేళ్లకోసారి పులుల గణన చేపడతారు.. ఉభయగోదావరి జిల్లాల్లో 2022లో చేపట్టారు.. ఒక్క రోజు రెండు రోజులు కాదండోయ్ ఏకంగా 90 రోజులపాటు లెక్కించారు.. నాడు అభయారణ్యంలో ఆరు చిరుతలు.. నాలుగు పెద్ద పులులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.. వచ్చే ఏడాది మళ్లీ పులుల గణన చేపట్టనున్నారు.. ఎందుకంటే గతేడాది ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అడపాదడపా జనారణ్యంలోకి పులులు వచ్చిన ఘటనలు ఉన్నాయి.. దీనిలో భాగంగా ఇప్పటినుంచే అధికారులు సన్నద్ధమవుతున్నారు.. అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో గోదావరికి ఇరువైపులా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్యను లెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మే నుంచి సర్వే చేపట్టాల్సి ఉండడంతో సన్నద్ధమవుతున్నారు. ఏటా నాలుగేళ్లకోసారి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు అటవీశాఖ పాపికొండల్లో 90 రోజుల పాటు పులుల లెక్కింపు నిర్వహిస్తుంది. చివరిగా 2022లో సర్వే జరిగింది. నాలుగేళ్లు పూర్తవడంతో వచ్చే ఏడాది మేలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గతంతో పోల్చితే ఈసారి పాపికొండల్లో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాపికొండలే ఆవాసం..

పులులు,చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 2.60 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. దూరంలో చెప్పాలంటే మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్నాయి. పాపికొండల మధ్యలో గోదావరి నది ఉంది. అందుకే పులుల రక్షణ ప్రాంతంగా పాపికొండలు ప్రసిద్ధి చెందాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో ఇక్కడ అనేక రకాల పక్షులు, జంతువులు సంచరిస్తుంటాయి. దీంతో ఆహారం, నీటికి ఏ మాత్రం పులులకు ఢోకా ఉండదు. ఈనేపథ్యంలో పులుల ఆవాస ప్రాంతంగా ప్రసిద్ధి కెక్కింది.

చివరిగా 2022లో సర్వే

పాపికొండల్లో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయి? అనే దానిపై రాజమహేంద్రవరం అటవీ శాఖ అధికారులు రంపచోడవరం, కాకినాడ అటవీ శాఖల సాయంతో నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడతాయి. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం పరిధిలో 45 రోజులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభయారణ్యం పరిధిలో 45 రోజులపాటు సర్వే చేశారు. రెండు దశల్లో కలిపి అభయారణ్యంలోని 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పులుల సంఖ్య లెక్కించారు. నాలుగు పెద్దపులులు, ఆరు చిరుత పులులు గుర్తించారు. అయితే ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోను పులులకంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారించారు. 2018లో నిర్వహించిన సర్వేలో అసలు ట్రాప్ కెమెరాలకు పులులు, చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలు బయటపెట్టలేదు.

- వచ్చే ఏడాదే పులుల గణన
- మే నెలలో లెక్కింపు
- 200కిపైగా సీసీ కెమెరాలు
- శ్రీశైలం నుంచీ నిపుణులు
- పులులు పెరిగే అవకాశం
- 12 ఉండొచ్చని అంచనా
- చివరిగా 2022లో సర్వే
- 6 చిరుతలు,4 పులులు గుర్తింపు
- 90 రోజుల పాటు సర్వే
- రంగంలోకి ఎన్‌టీసీఏ

ఈసారి పెరగడం ఖాయమే..

వచ్చే ఏడాది మేలో చేపట్టనున్న సర్వేకు సంబంధించి త్వరలో సన్నాహాలు ప్రారంభించడానికి అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి మరింత పగడ్బందీగా పులుల లెక్క తేల్చాలని భావిస్తోంది.ఈ మేరకు అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వాస్తవానికి పలుసార్లు సర్వే కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా అవి చిక్కడం లేదు. దీనివల్ల వాస్తవ సంఖ్య తేలడం లేదు. మే నెలలో చేపట్టనున్న సర్వే సమయానికి అడవుల్లో చెట్ల ఆకులు రాలిపోయి కెమెరాలు బిగించడం కొంత సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అటు ట్రాప్ కెమెరాలో వీడియోలు సైతం రికార్డవడానికి అనువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతం నుంచి నిపుణులను రప్పించనున్నారు. ఈ దఫా సర్వేలో పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో వీటి సంతానం కూడా బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేసింది. ప్రధానంగా రంప అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుతలు 12 వరకు ఉంటాయని చెబుతున్నారు.

గతేడాది ఇలా..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం నుంచి గతేడాది దారి తప్పి పులులు జనావాసాల్లోకి వచ్చేసిన సంఘటనలను గుర్తు చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండల అభయారణ్యం నుంచి వచ్చింది. అక్టోబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ఆనవాళ్లు బయటపడ్డాయి. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత పులి దారితప్పి వచ్చేసింది. ఇది పాపికొండల అభయారణ్యం నుంచే వచ్చిందని గుర్తించారు.అప్పట్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు అడవుల్లో పులులు, చిరుతల స్థావరాలు చెల్లాచెదురయ్యాయి. దీంతో కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో చిరుత గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అప్పట్లో అంచనా వేశారు. పాపికొండల అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతం లోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ప్రధానంగా ఈ తరహా సంఘటనలు 2022 నుంచి 2024 మధ్యే ఎక్కువగా జరిగాయి. పాపికొండల అభయారణ్యంలో పెరిగిన పులుల సంచారానికి ఈ ఘటనలు నిదర్శనంగా భావించొచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఏడాది మే తర్వాత ఈ లెక్కకు సంబంధించి దాదాపు స్పష్టత రావొచ్చని చెబుతున్నారు.

కోళ్ల అమ్మకాలపై అప్రమత్తం

150 కిలోల మాంసం పూడ్చివేత



కోడి మాంసాన్ని పూడ్చిపెడుతున్న దృశ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కానూరులో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకడంతో జిల్లాలోని అధికారులు అప్రమత్తమయ్యారు. కోడిమాంసం, కోడిగుడ్ల విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ బుధవారం మాంసం విక్రయ దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలపై మెరుపుదాడి చేశారు. నగర పంచాయతీ పరిధిలో పలు మాంసం విక్రయ దుకాణాలు, హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లలో ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన 150 కిలోల కోడి మాంసాన్ని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డులో పూడ్చి పెట్టించారు. కోడి మాంసం విక్రయాలు జరపరాదని హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా ఆదేశాలను ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని, షాపులు సీజ్ చేయడమే కాకుండా రూ.20వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ముమ్మిడివరం మార్కెట్ హైస్కూలు సమీపంలో ఉన్న కోడిమాంసం దుకాణాన్ని తనిఖీ చేసి అక్కడ అమ్మకానికి సిద్ధం చేసిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మార్కెట్‌లో హోల్‌సేల్ కోడిగుడ్ల విక్రయ కేంద్రంలో తనిఖీచేసి విక్రయాలు జరపరాదని ఆదేశించారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న కోడిగుడ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పరిధిలోని 28 అంగన్‌వాడీ కేంద్రాలలో కోడిగుడ్లను వినియోగించరాదని ఆదేశించారు. ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో హోల్‌సేల్ కోడి మాంసం విక్రయ దుకాణంలో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన 20 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే కాశివానితూము సెంటర్‌లోని బైపాస్ రోడ్డులో రెండు హోల్‌సేల్ కోడిమాంసం దుకాణాల్లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన 50 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రెస్టారెంట్‌లో బాగా నిల్వ అయిన 10 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. బొండాయికోడు వద్ద పంజాబీ డాబాలో నిల్వ అయిపోయిన 20 కిలోల కోడిమాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటినీ డంపింగ్ యార్డుకు తరలించి పాతిపెట్టారు. బర్డ్‌ఫ్లూ ఉన్నందున రెండు వారాల పాటు కోడి మాంసం విక్రయాలు సాగించరాదని, ప్రజలు మాంసం వినియోగాన్ని తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కమిషనర్ వెంట ఏఈ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, శానిటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



ఆ ఆనందం పేరు **ఆకాశవాణి**
నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 6లో

ఆహ్లాదంగా భీమేశ్వరుని వసంతోత్సవం,
ద్రాక్షారామలో భీమేశ్వరుని వసంతోత్సవం వైభవంగా జరిగింది.. 6లో

నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం

ఆ ఆనందం పేరు 'ఆకాశవాణి..



బుల్లి పెట్టెలో బూచోడు..



రేడియోలో పాటలు వింటున్న డాక్టర్ విజయారెడ్డి

బూచాడమ్మా బూచాడు.. బుల్లెపెట్టెలో ఉన్నాడు.. కళ్లకెప్పుడూ కనబడడు.. కబుర్లెన్నో చెబుతాడు అంటూ రేడియోలో పాట విని ఎంతో కాలమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగి సెల్‌ఫోన్లు, టీవీలు రావడంతో రేడియోలన్నీ మూలకు చేరిపోయాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూడా రేడియోలో వార్తలు వింటూ సిలోన్ నుంచి వచ్చే పాటల కోసం ఎదురుచూస్తున్నారంటే ఆశ్చర్యమే మరి.

అమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డికి రేడియో అంటే ప్రాణం. అమలాపురంలోని ఫిలిప్స్ షోరూంలో 1997లో కొనుగోలు చేసిన రేడియోనే నేటికీ ఆయన వినియోగిస్తున్నారు. మండల పశువైద్యాధికారిగా పనిచేసే సమయంలో 27 ఏళ్ల కిందట ఆయన ఈ రేడియోను కొనుగోలు చేశారు. ఎప్పుడైనా ఆ రేడియో పాడైతే వెంటనే బాగు చేయించుకుని వచ్చి వినియోగిస్తూ ఉంటారు. సెల్‌ఫోన్ కంటే రేడియో ఉత్తమమని చెబుతారాయన. శ్రోతలు కోరిన ఎన్నో మంచి మంచి పాటలు వినడంతో పాటు సత్యమైన ఆకాశవాణి వార్తలు వింటూ ఉంటానన్నారు. ఆ పాత మధురమైన పాత పాటలు రేడియోలో వింటే ఆ ఆనందమే వేరంటున్నారు. మూడు పెద్ద సైజు నిప్పో బ్యాటరీలతో పనిచేసే ఆ రేడియో పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో బాగా పనిచేస్తుందని, పల్లె ప్రాంతాల్లో విధులకు వెళ్లినప్పుడు ఖాళీ దొరికితే ఆ రేడియో తనకు మంచి నేస్తంగా మారిపోతుందని చెప్పారు. - అమలాపురం టౌన్

ఆ ఇల్లే.. ఓ రేడియో..



నిద్ర లేవగానే రేడియో ఆన్‌చేసే రోజులవి. కరెంటుతో సంబంధం లేకుండా బ్యాటరీలే ఆధారంగా రేడియోలు పనిచేసే రోజులవి. పల్లె, పట్టణమన్న బేధం లేకుండా ప్రజలకు 1960, 1970 దశకాల్లో రేడియో అతిపెద్ద వినోద సాధనం. వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యథార్థమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజలందరినీ పాటలతో పరశింపచేసిన రోజులవి. ఆ రోజుల్లోనే అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రావూస్ రేడియో సర్వీస్ సెంటర్‌ను రావూస్ నాగేశ్వరరావు 1970వ దశకంలో ప్రారంభించారు. ఫిలిప్స్ రేడియో ఆథరైజ్డ్ డీలర్ షిప్‌ను దక్కించుకున్నారాయన. రేడియో మెకానిక్‌గా పేరొందిన నాగేశ్వరరావు గడియారస్తంభం సెంటర్‌లోని తన ఇంటిని ఫిలిప్స్ రేడియో ఆకారంలో డిజైన్ చేయించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్షణం తీరిక లేకుండా రేడియోలు విక్రయించారాయన. ఎక్కెడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చినవారు రావూస్ నాగేశ్వరరావు రేడియో షాపులో రేడియోలు కొనుగోలు చేసేవారని నాటితరం వారు నేటికీ చెబుతున్నారు. 1980వ దశకంలో టేప్‌రికార్డర్లు రావడంతో రేడియోల వినియోగం తగ్గింది. కాలక్రమంలో సీడీ ప్లేయర్లు, ఇతర వినోద సాధనాలు అందుబాటులోకి రావడంతో క్రమక్రమంగా వ్యాపారం సన్నగిల్లింది. - అమలాపురం టౌన్

రేడియో.. ఓ చరిత్ర



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో నలుదిక్కుల సమాచారాన్ని చేరవేసే తొలి ప్రసార సాధనంగా రేడియో చరిత్ర సృష్టించింది. ప్రపంచ సమాచార వ్యవస్థ గతినే రేడియో మార్చేసింది. గాలి, ధ్వని తరంగాల ద్వారా సమాచారాన్ని క్షణాల్లో విశ్వాన్ని చుట్టేదే రేడియో. నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. రేడియోను మానవాళికి కానుకగా ఇచ్చినవాడు మార్కోని. మార్కోనికి ముందు పద్దెనిమిదవ శతాబ్దంలో రేడియో సాంకేతికతకు కొంత ప్రయత్నం జరిగింది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జేమ్స్ మాక్స్ వెల్, జర్మనీకి చెందిన హెర్జ్, కాథలిక్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎడ్వర్డ్ బ్రాన్లీ రేడియో సాంకేతికతకు పునాదులు వేశారు. ఆ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని 1896లో రేడియోకి ఒక రూపాన్ని ఇచ్చాడు మార్కోని. అయితే దాని ప్రసార పరిధి రెండు కిలోమీటర్ల దూరానికే పరిమితమైంది. 1907లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన జాతీయ గీతాన్ని ఒక ఓడ నుంచి మరో ఓడకి ప్రసారం చేయడంలో రేడియో ముందడుగు వేసింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధ నౌకకు వైర్‌లెస్ ద్వారా మార్కోని సందేశం పంపించాడు. ఇలా రేడియో విశ్వవేదిక మీదుకు అడుగుపెట్టింది. మన దేశంలో రేడియో ప్రసారం 1923 జూన్ నెలలో జరిగింది. బొంబాయి రేడియో క్లబ్ దానికి నేతృత్వం వహించింది. ఆ తర్వాత బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో 1927లో కలకత్తా, బొంబాయి నగరాల్లో రేడియో ప్రసారాలు అందుబాటులోకి వచ్చాయి. 1936లో ఆకాశవాణి ప్రభుత్వ సంస్థగా అవతరించింది. ఆ తర్వాత మద్రాసు కేంద్రంగాను, అటుపై విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల నుంచి రేడియో ప్రసారాలు జరిగేవి. ప్రతి ఇంట్లోను, షాపులోను, టీ దుకాణాల్లోను, హోటళ్లలోను ఇప్పుడు ఎల్‌సీడీ టీవీల మాదిరిగా రేడియోలు అప్పట్లో కనిపించేవి. 1946లో స్వాతంత్ర్యోద్యమ సమయంలో రేడియో అత్యంత కీలక పాత్ర పోషించింది. రేడియో భారతదేశంలోకి ప్రవేశించి ఇప్పటికి 102 ఏళ్లు.

పాతకాలం వస్తువై పోయింది..



ప్రసారాలను వింటున్న నాగేశ్వరరావు

రేడియో ఓ పాతకాలం నాటి వస్తువైపోయింది. కానీ ఇప్పటికీ ఆయనకు రేడియోనే ప్రధాన ప్రసార సాధనం. పేరు వజ్రపు నాగేశ్వరరావు. సామర్లకోటలోని సంపెంగతోటకు చెందిన ఈయన సంపెంగపూల వ్యాపారి. ఇంటి వద్ద నిత్యం రేడియోతోనే కాలక్షేపం చేస్తాడు. ఇప్పటికీ వార్తలతోపాటు పాటలు, కాలక్షేపం కబుర్లు వింటూ ఉంటాడు. అటుగా పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు అతడి రేడియో కాలక్షేపాన్ని ఆసక్తిగా గమనిస్తుంటారు. గత నలభై ఏళ్లుగా రేడియో వింటున్నానని ఆయన చెప్పాడు. తన రేడియోలో వాడే బ్యాటరీల కోసం నెలకు రూ.100 వరకూ ఖర్చుపెడతానని చెప్పాడు. - సామర్లకోట

మదిలో మెదులుతున్నాయి..



ఆధునిక టెక్నాలజీతో ఎఫ్‌ఎం రేడియో తరం వచ్చినా నా చిన్ననాటి ఆకాశవాణి ప్రసారాలే నేటికీ మదిలో మెదులుతున్నాయి. మా చిన్నాన్న గారు ఇంట్లో మార్ఫి రేడియో ఉండేది. మాపిన్ని శకుంతలకు ఉదయం భక్తిరంజని అంటే చాలాఇష్టం. అందులో ఎస్పీ బాలు భద్రాచల రామదాసు కీర్తనలు, ఎమ్మెస్ రామారావు హనుమాన్ చాలీసా ఎక్కువగా వినేవాళ్లం. 1984లో నేను డిగ్రీ చదివే రోజుల్లో ఎక్కువగా ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రసారం చేసే యువవాణి వినేవాడిని. డీఎస్ఆర్ ఆంజనేయులు చాలా చక్కటి కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవారు. నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఉభయకుశలోపరి కార్యక్రమానికి ఉత్తరాలు రాసేవాడిని. శ్రోతల అభిప్రాయాలను రేడియోలో తెలియజెప్పేటప్పుడు నా పేరు రేడియోలో వినేందుకు మా కుటుంబ సభ్యులంతా ఆత్రుతగా ఎదురుచూసి పేరు చదవగానే ఆనందపడేవాళ్లం.

పరస జగన్నాథరావు, ఉపాధ్యాయుడు, రాజమహేంద్రవరం

- రాజమహేంద్రవరం సిటీ

బావగారి కబుర్లు గుర్తున్నాయా..!

ఉదయాన్నే భక్తిరంజని వింటూ ఇంటి పనులు కానిచ్చేవారు. భక్తిరంజనిలో ఆరోజుకు అనుగుణంగా భక్తి కార్యక్రమాలు ప్రసారమయ్యేవి. శనివారం వెంకటేశ్వర సుప్రభాతం, ఆదివారం ఆదిత్య హృదయం, సోమవారం శివస్తోత్రం.. ఉదయం అర్థగంటపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆకాశవాణి శ్రోతలను రంజింపజేసేది. ఉదయం 7 గంటలకు తెలుగులో వార్తలు, 8 గంటలకు ఆంగ్లంలో, అనంతరం హిందీలో వార్తలు. తెలుగు వార్తలంటే తిరుమలశెట్టి శ్రీరాములు గుర్తుకు రాకమానరు. 'ఈ ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఓడిపొయ్యారు(ఓడిపోయారు).' ఎన్నికల వార్తలు చదవడంలో ఆయన భాషలోని యాస అందరినీ ఆకట్టుకునేది. ఇక మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమంలో కార్మికుల కోసం పలు కార్యక్రమాలు. అనంతరం బావగారి కబుర్లు. ఈ కబుర్లలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ అంశాలపై శ్రోతలకు అర్థమయ్యేలా బావగార్లు మాట్లాడుకోవడం శ్రవణానందంగా ఉండేది. వనితావాణి, మహిళా మండలి కార్యక్రమాలు అతివలను ఎంతగానో ఆకట్టుకుంటూ కొనసాగేవి. చిత్రసీమ, శ్రోతలు కోరిన పాటలు, చిత్రరంజని సినిమాగీతాల కార్యక్రమాలకు రేడియోల వద్ద చిన్నల నుంచి పెద్దల వరకు కాపుకాసేవారు. పాటల కోసం ఉత్తరాలు రాసిన శ్రోతలు తమ పేరు చదవగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఆ క్షణాలు ఎలా మరచిపోగలం. బుధవారం, శనివారం రాత్రి అరగంటసేపు ప్రసారమయ్యే నాటికల కోసం జనం ఎదురుచూసేవారు. ఆదివారాల్లో వారం విడిచి వారం ప్రసారం చేసే ఒక గంట వ్యవధి రేడియో నాటకం, ఆకాశవాణి సంక్షిప్త శబ్దచిత్రాల కోసం పడిగాపులు పడిన రోజులు చాలామందికి గుర్తుండే ఉంటుంది. సంగీత ప్రియులకోసం కర్ణాటక, హిందూస్థానీ సంగీత కార్యక్రమాలు, లలిత సంగీతం వంటి వివిధ కార్యక్రమాలు ఆయా వర్గాల శ్రోతల కోసం ప్రసారమయ్యేవి. చిన్నారుల కోసం బాలానందం వంటి కార్యక్రమాలను రూపొందించి రేడియో అన్నయ్య, అక్కయ్యలను జనం ఇంకా గుర్తుంచుకున్నారు. రైతుల కోసం పొలం పనులు, పాడిపంటలు ప్రసారం చెయ్యడంలో విజయవాడ, హైదరాబాదు కేంద్రాలు పోటీపడేవి. సిలోన్ (శ్రీలంక) ఆకాశవాణి కేంద్రాన్ని గుర్తుచేసుకోకపోతే ఎలాగండీ?? సాయంత్రం సిలోన్ కేంద్రం ద్వారా ప్రత్యేకంగా ప్రసారమయ్యే తెలుగు సినిమా పాటల కోసం పాటల ప్రియులు ఎదురుచూసేవారు. క్రికెట్ మ్యాచ్ లైవ్‌ను రేడియో ద్వారా విని క్రీడాభిమానులు తెగ సంబరపడేవారు. నిజానికి క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో రేడియోల విక్రయాలు ఎక్కువగా జరిగేవంటే అతిశయోక్తి కాదు. ఇలా ఆకాశవాణి అన్ని వర్గాల జనానికి చేరువై దూరదర్శన్ అవతరణ అనంతరం క్రమంగా దూరం జరుగుతూ వచ్చింది. - ఉప్పలగుప్తం

ప్రకృతి విపత్తుల్లో నమ్మకమైన నేస్తం..

ఉభయ గోదావరి జిల్లాల్లో తరచు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి. అలాంటి సమయంలో రేడియో గొప్ప నేస్తంగా నిలిచేది. విశాఖ ఆకాశవాణి నుంచి మనకు ప్రసారాలు వస్తుంటాయి. 1986లో గోదావరి జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించినప్పుడు విశాఖ ఆకాశవాణి వరదల సమాచారం, అప్రమత్తత గురించి వందలాది బులిటెన్లు అందించింది. 1996లో తుఫానుకు కోనసీమ కకావికలమైనప్పుడు కూడా అక్కడి నుంచే సమాచార ప్రసారాలను అందించింది. ఈ సమయానికి టీవీ ఛానళ్ల ప్రభావం పెరిగినప్పటికీ విద్యుత్ సరఫరాతో సమాచారం అందే పరిస్థితి లేదు. విశాఖ మీడియం వేవ్‌తోపాటు విశాఖ ఎఫ్‌ఎం కూడా విశేషమైన సేవలందించింది.

నేడు ఎఫ్‌ఎంకు ప్రాధాన్యం



రేడియో ఆకాశవాణికి గతంలో చాలా ప్రాధాన్యం ఉండేది. క్రమేపీ ఆధునిక యుగంలో రేడియోలో కొత్త చానల్స్ ప్రవేశించాయి. అప్పుడు ఆకాశవాణి ఉంటే, ఇప్పుడు ఎఫ్‌ఎం రేడియో ప్రవేశించింది. చాలామంది తమ సెల్‌ఫోన్లలో, కార్లు, ఆటోలు, బస్సుల్లో ఎఫ్‌ఎమ్ రేడియోలను వినియోగించి సినిమా పాటలు, హాస్య సంభాషణలుతో ఆనందం పొందుతున్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌తో..

ఇప్పటికీ రేడియో ప్రత్యామ్నాయ నిరంతర ప్రసార సాధనంగానే ఉంది. విద్యుత్‌తో పనిలేకుండా పనిచేసే మీడియం. మారుమూల కుగ్రామాలకు సైతం రేడియో ప్రసారాలు వినిపించగలవు. అందుకే ప్రధాని మోదీ రేడియోను ఒక శక్తివంతమైన ప్రసార సాధనంగానే వినియోగిస్తున్నారు. మన్‌కీ బాత్ (మనసులో మాట) పేరుతో ప్రతి నెల ప్రజల ముందుకు వస్తున్నారు. కుగ్రామాల్లో, కొండల్లో, గుట్టల్లో తన వాణిని వినిపించేలా మోదీ అద్భుతంగా రేడియోని వినియోగించుకోవడం విశేషం.

కన్నుల పండువగా చక్రస్నానం

- అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన సముద్ర తీరం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు



గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి చక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్ద నుంచి అలంకార మండపంలో అర్చకుల పూజలందుకున్న స్వామివారిని రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై పెట్టి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి, పేరూరు ఉద్దండ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, డీసీ రమేష్‌బాబు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, డీఎస్పీ మురళీమోహన్, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, పోతు రాజు శ్రీవేంకటకృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, సీఐలు నరేష్ కుమార్, భీమరాజు, ఎస్ఐ కె. దుర్గాశ్రీనివాస్, వాహనకారులు, భక్తులు, తదితరులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సముద్ర తీర మంతా భక్తులతో కళకళలాడింది. అనంతరం ఎమ్మెల్యే కూటమి శ్రేణులు, దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు పోలీసులు పుణ్యస్నానాలు ఆచరించారు.



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఆర్డీవోలు, డీసీ, ఏసీ

● నేడు స్వామివారి తెప్పోత్సవం

కల్యాణోత్స వాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయం సుప్రభాతసేవ, తిరువారాధన, బాలభోగం, సాయంత్రం ఐదు గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు వారిచే నిర్మితమైన పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనుంది. సాయంత్రం ఆరు గంటలకు చివరి ఘట్టమైన శ్రీస్వామివారి తెప్పోత్సవం ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఈ ఏడాది నూతనంగా ఏర్పాటుచేసిన చెరువులో మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలతో చేసిన హంసవాహనంపై బ్రహ్మాండమైన బాణసంచా కాల్పులతో వెంప వాస్తవ్యులు గొట్టుముక్కల భీమరాజు సహకారంతో తెప్పోత్సవం జరగనుంది. రాత్రి ఎనిమిది గంటలకు తిరుమంజనములు, దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్టి, శ్రీస్వామివారి పవళింపుసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.



తీరాన్ని తాకిన భక్త జనసందోహం



సముద్ర తీరంలో చక్ర, జల్లుస్నానాలను పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఆనందోత్సాహాలతో ..

భీమేశ్వరుడి వసంతోత్సవం



కల్యాణమూర్తులపై వసంతాలు పోస్తున్న అర్చకస్వాములు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం త్రిశూల, శ్రీచక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం వేగాయమ్మపేట ఆస్థాన మండపం వద్ద నుంచి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామి వార్లను రథంపై ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు జరిగాయి. తదుపరి మండపారాధన, నాకబలి పూజలు ఆగమ పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం వసంతోత్సవం జరిగింది. కల్యాణమూర్తులైన అమ్మవారు, స్వామి వార్లకు వసంతాలు చల్లారు.

అనంతరం అర్చక స్వాములు కల్యాణమూర్తులను చేతపట్టి వసంతాలు జల్లుకున్నారు. మంగళవాయిద్యాలకు అను గుణంగా లయబద్ధంగా నృత్యంచేస్తూ దండాడింపు, వసంతోత్సవం ఆహ్లాదంగా జరిగాయి. తదుపరి సప్తగోదావరి నదిలో త్రిశూల, శ్రీచక్రస్నానం అర్చకస్వాములు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు త్రిశూల, శ్రీచక్ర స్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకదుర్గాప్రసాద్, అర్చకులు, సిబ్బంది, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సారె సమర్పణ: భీమేశ్వర పారాయణం చేస్తున్న మహిళలు మాణిక్యాంబ అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు , చీర, రవికె సమర్పించారు.



నృత్యం చేస్తున్న అర్చక స్వాములు

చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు



విజయవాడ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నస్రత్ మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని నియంత్రించేందుకు ఈ రైళ్లను ఈనెల 23వ తేదీ వరకు నడుపుతున్నట్లు తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి కాకినాడ టౌన్‌కు ఉదయం 4.30 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు కాకినాడలో సాయంత్రం 6.55కు బయలుదేరుతుంది. చర్లపల్లికి ఉదయం 6.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 16, 23 తేదీలలో నడుస్తుంది. 07233 చర్లపల్లి - నరసాపూర్ రైలు రాత్రి 7.15కు చర్లపల్లిలో బయలుదేరి నరసాపూర్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి చర్లపల్లికి ఉదయం 8 గంటలకు చేరుతుంది. చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. దీనికి టూఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండతరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు. చర్లపల్లి - నరసాపూర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండవరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు.



తొండంగి సముద్రతీరంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మాఘపౌర్ణమి స్నానాలకు పోటెత్తిన భక్తులు

- సముద్రునికి హారతులు
- ఉప్పాడ, తొండంగి తీరాల్లో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు



ఉప్పాడ రేవులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు.. ఇన్‌సెట్‌లో సముద్రుడికి నమస్కరిస్తున్న మహిళ

కొత్తపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం కాకినాడ జిల్లా ఉప్పాడ రేవులోను, తొండంగి తీరంలోను పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. కరోనా తర్వాత మాఘపౌర్ణమిలో వేలాదిమంది భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం. పిఠాపురంనుంచి శ్రీ కుంతీ మాధవస్వామి(దొంగదేముడు) బుధవారం తెల్లవారుజామున వేదపండితులు పల్లకిలో ఊరేగించుకుంటూ కొత్తపల్లి మండలం ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి చక్రస్నానం చేయించారు. స్వామివారి చక్రస్నానం అనంతరం పిఠాపురం, కత్తిపూడి, శంఖవరం, తుని, కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఉప్పాడ రేవులో సముద్ర స్నానాలు చేసి ఒడ్డునే ఉన్న శ్రీకుంతీ మాధవస్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాయకర్ కాలనీలో గంగాలమ్మతల్లి జాతరలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు కానుకలు సమర్పించారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప్పాడరేవులో భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం.



పౌర్ణమి పర్వదినాన రత్నగిరిపై రద్దీ

అన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం సత్యదేవుని సన్నిధికి భక్తులకు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి 2గంటల సమయం పట్టింది, 40వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35లక్షల ఆదాయం లభించింది.

తొలిరోజు ఉపసంహరణలు నిల్

- నేటితో ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణల గడువు ముగింపు

ఏలూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లను తొలిరోజు బుధవారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. దీంతో ప్రస్తుతానికి 43మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 13వ తేదీ గురువారంతో ముగియనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బరిలో నిలిచిన అభ్యర్థులకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి గుర్తులను కేటాయించనున్నారు. పరిశీలనలో 11మంది నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో వాటిని తిరస్కరించిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

కరప,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేదాసి సూరిబాబును అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేడపాటి శ్రీనివాసరావు ఈనెల 9న వేళంగి-జి.బావారం రోడ్డులో వైన్‌షాప్ దగ్గర కత్తితో విచక్షణంగా దాడి చేశాడు. నిందితుడిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని ఎస్‌ఐ చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో గడ్డి మందు తాగి ఇద్దరి మృతి

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వివిధ కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు సేవించి తీవ్ర అస్వస్థతకు గురై కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఆర్ జిల్లా గంగవరం మండలం జగ్గంపాలేనికి చెందిన వి.వీరప్రసాద్ (27) వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆ యువకుడిని గమనించిన కుటుంబీకులు తొలుత గోకవరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామానికి చెందిన వల్లు ఏసుబాబు(54) వేరేవారి గేదె తన వల్లే చనిపోయిందని ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఏసుబాబు గేదెను చెందిన వారికి నష్టపరిహారంగా రూ.25వేలు ఇవ్వాలని స్థానిక పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఏసుబాబు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబీకులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాకీ టోర్నమెంట్‌కు రానున్న 40 టీంలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరిగే 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో 18 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలు, 11 ప్రాంతీయ క్రీడా మండళ్ల నుంచి 40 టీంలు పాల్గొంటున్నాయని టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇందులో 33 పురుషుల టీములు, 7 మహిళల టీములు పోటీపడనున్నాయన్నారు. మొత్తం 538మంది పురుష క్రీడాకారులు, 205 మంది మహిళా క్రీడాకారులు, వారితోపాటు 70మంది కోచ్‌లు, మేనేజర్లు ఈవెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. హర్యానా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతి, రవాణా, ఆహార ఏర్పాట్లను చేపట్టామని తెలిపారు.

తుని బాలుడి కిడ్నాప్ కేసులో..

పాఠశాల పీఈటీయే నిందితుడు

- మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కిడ్నాప్‌నకు పథకం
- ఈజీ మనీ కోసమే చేశారని వెల్లడించిన పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తునిలో సోమవారం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్ ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ పాఠశాలలో పీఈటీయే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ కిడ్నాప్‌కు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈనెల 10న తుని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థి కిడ్నాప్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో పోలీసులకు దొరికిపోతామన్న భయంతో కిడ్నాపర్లు వెనుకంజ వేశారు. బాలుడిని ఆటోలో ఇంటికి పంపించేస్తున్నట్టు తండ్రికి ఫోన్‌చేసి చెప్పారు. దీంతో ఆ బాలుడు తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేరాడు. అనంతరం కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో బాలుడి కిడ్నాప్‌కు పాల్పడ్డ ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి ఒక కారు, ద్విచక్రవాహనంతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. తుని డీఎస్పీ శ్రీహరిరాజు కేసు వివరాలను వెల్లడించారు. తునిలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఉపాధ్యాయుడు ఎం.రాజీవ్‌తో కలిసి రౌతులపూడి మండలం లచ్చిరెడ్డి గ్రామానికి చెందిన చందవాడ కాశీవుడు, ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన సురకాసుల రాముడు పథకం ప్రకారమే బాలుడ్ని కిడ్నాప్ చేసినట్టు తెలిపారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఈ పనికి పాల్పడ్డారని, నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచనున్నామని చెప్పారు. సమావేశంలో తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, ఎస్‌ఐ విజయ్‌బాబు, తుని పీఎస్ ఏఎస్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

రామ్ పోతినేని సినిమా షూటింగ్

- కొవ్వూరులో చిత్రీకరణ



కొవ్వూరు లాంచీలరేవు వద్ద రావురమేష్‌పై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మైత్రి మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న హీరో రామ్ పోతినేని సినిమా చిత్రీకరణ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం జరిగింది. కొవ్వూరు పట్టణంలోని లాంచీలరేవు వద్ద గోదావరి ఏటిగట్టు రోడ్‌పై రావు రమేష్ సైకిల్‌పై తన కొడుకును ఎక్కించుకుని వెళ్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా రామ్ పోతినేని, హీరోయిన్‌గా మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే, ప్రధాన తారాగణం రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్ నటిస్తున్నారు. సంగీతం వివేక్ మార్విన్ అందజేస్తున్నారు. మరో 40రోజులపాటు గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుగుతుందని దర్శకుడు మహేష్‌బాబు, ప్రొడక్షన్ డిపార్ట్‌మెంటు సభ్యులు తెలిపారు. సినిమా షూటింగ్ కారణంగా రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

పీడీఎఫ్, యూటీఎఫ్‌లపై హర్షకుమార్ వ్యాఖ్యలు సరికాదు

- అభ్యర్థులందరి సమక్షంలోనే రాఘవులు నామినేషన్ ఆమోదం
- ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐవీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడీఎఫ్, యుటీఎఫ్‌లను విమర్శిస్తూ మాజీ ఎంపీ హర్షకుమార్ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ఖండించారు. కాకినాడలోని యుటీఎఫ్ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐవీ మాట్లాడుతూ పీడీఎఫ్ ఎల్లప్పుడూ ప్రజాపక్షమేనన్నారు. పీడీఎఫ్, యూటీఎఫ్ అధికార కూటమికి అమ్ముడుపోయాయని ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారమే జరిగిందని, ఇతర అభ్యర్థుల సమక్షంలోనే డీవీ రాఘవులు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారని తెలిపారు. పీడీఎఫ్ కులపరమైన అభ్యర్థుల ఎంపిక గానీ, కులపరంగా ఓట్లు అభ్యర్థించడంగానీ చేయదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల్లో పీడీఎఫ్ ప్రచారం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఉద్యమాల్లో రాఘవులు భాగస్వాములు అయ్యారన్నారు. హర్షకుమార్ తన అభ్యర్థి గుణగణాలు, అర్హతలు ప్రజలకు చెప్పి ఓట్లు అడిగితే బాగుంటుందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థిపై హర్షకుమార్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఐవీ హితవు పలికారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో రాజకీయం

- సామాజికవర్గ ఓట్లు చీల్చేందుకు ప్రయత్నం
- మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన నామినేషన్ల ప్రక్రియలో భారీ రాజకీయం జరిగిందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల స్క్రూట్నీ పద్ధతిలో తొలుత పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవరావు డిస్ క్వాలిఫై అయ్యారని ప్రకటించారని, చివరిలో క్వాలిఫై అయినట్లు లిస్ట్‌లో ప్రకటించారని తెలిపారు. పీడీఎఫ్ అభ్యర్థి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారని తాను కూడా స్వాగతించానని, డిస్ క్వాలిఫై చేసి మళ్లీ క్వాలిఫై చేయడాన్ని బట్టి కుమ్మక్కైనట్లుగా అర్థమవుతోందన్నారు. ఇదంతా పోటీలో ఉన్న తన కుమారుడు జీవీ సుందర్‌కి, వీరరాఘవరావుకు మధ్య ఓట్లు చీల్చడం కోసమే చేశారని ఆరోపించారు.

‘వ్యవస్థలతో కుటిల రాజకీయాలు’

తుని రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తోందని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. తునిపట్టణంతోపాటు గ్రామీణప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి మేనిఫెస్టో వివరించారు. అనంతరం తునిలో మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా జరిగిన విషయాన్ని వివరించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సుందర్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దారా సురేష్, తంతటి కిరణ్‌కుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలిగా సునీత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలిగా కె.సునీత నియమితులయ్యారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీగా ఈమె పనిచేస్తున్నారు. మరో రెండురోజుల్లో ఈమె కాకినాడ జిల్లాకు రానున్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు.

సత్యసూర్య బ్యాంకర్స్‌వద్ద ఖాతాదారుల గగ్గోలు



ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు హేమంత్ కార్యకలాపాలు నిర్వహించకుండా పరారైన నేపథ్యంలో అక్కడ బంగారం తాకట్టు పెట్టిన బాధితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమ బంగారం తమకు ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నిర్వాహకుడు హేమంత్ కుటుంబసభ్యులతో సహా పరారై పదిరోజులైందని, తమకు సమాధానం చెప్పాలంటూ లైసెన్సుదారుడైన శ్రీఘాకోళ్లపు రామకృష్ణను, అతని తండ్రి సత్యనారాయణను నిలదీశారు. బాధితులందరికీ తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన మెర్లపాలెం విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఈతకోట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలో మెర్లపాలెం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు. అండర్-19 జూనియర్ బాలుర విభాగంలో ముగ్గురు విద్యార్థులు, జూనియర్ బాలికల విభాగంలో నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ శ్రీకాంత్ తెలిపారు. వీరిని సర్పంచ్ మెర్ల రాము, హెచ్‌ఎం శ్రీహరి, చైర్మన్ లక్ష్మీనారాయణ అభినందించారు.

అనుమతులు లేని 8 ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శివారు కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మైన్స్ ఆర్‌ఐ సుజాత తన సిబ్బందితో వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా తరలిపోతున్న 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి కొత్తపేట పోలీసులకు అప్పగించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం నెల్లూరుకు చెందిన బాలకృష్ణారెడ్డి-శైలజ దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాత దంపతులను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



వై.సుభ శ్రీవల్లీ ఆత్రేయి



పి.ఆదిత్య అభిషేక్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచి అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వై.సుభ శ్రీవల్లీ ఆత్రేయి, పి.ఆదిత్య అభిషేక్ 99.97 పర్సంటైల్ సాధించారని, జీఎస్‌ఆర్ శశాంక్ 99.96, టి.సాత్విక్, జి.ఇనేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారని, వీరితోపాటు మరో 47మంది ఆదిత్య విద్యార్థులు 99.00 పైన పర్సంటైల్ పొందారని తెలిపారు. వై.వెజిత్ 99.93, వైపీవీఎస్ చక్రపవన్ 99.92, ఎంజే చంద్ర, కేపీసాయి, జి.లోసిని 99.91 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ అభినందించారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాలకోసం కాటన్ బ్యారేజ్‌నుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల నీరు విడుదలచేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1800క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. నదిలో నీటిలభ్యత 8309క్యూసెక్కులుండగా నీటి మట్టం 9.60 అడుగులుగా నమోదైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు వచ్చిన ఓ మహిళ విగతజీవిగా ఇంటికి చేరింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథం తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన భీమడోలు మనోహర్ తన భార్య దయామణి(45)తో కలిసి స్థానికంగా ఏవీ అప్పారావు రోడ్డులో బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చారు. సాయంత్రం 5గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. తాడితోట గోకుల్ టీవీఎస్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు టైరు ఎక్కేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

‘లోవ’లో హుండీ లెక్కింపు

- రూ.39.31లక్షల ఆదాయం



తలుపులమ్మ లోవ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీలు లెక్కింపు బుధవారం నిర్వహించారు.కాకినాడ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హుండీలు తెరిచి లెక్కించగా 66రోజులకుగాను రూ.39.91లక్షలు నగదుతో పాటు రూ.30.121 గ్రాముల బంగారం, 1.355 కిలోల వెండి ఆలయానికి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొనగా దేవదాయశాఖ తనిఖీదారులు బి.ఫణీంద్ర కుమార్‌తో కలిసి ఆలయ ఈవో విశ్వనాధరాజు పర్యవేక్షించారు.

బి.ప్రత్తిపాడులో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్‌బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పిఠాపురంరూరల్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో బుధవారంరాత్రి పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ తనిఖీలు నిర్వహించారు. రేకులషెడ్డులో నిల్వఉన్న 30క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆకుల గంగరాజుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి’

అంబాజీపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిర్వహించే ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. మాచవరం, పుల్లేటికుర్రుల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన ఎంపీడీవో జీవీ సరోవరరావుతో కలిసి పరిశీలించారు. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో వ్యాపారం, మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెంటర్లు, సర్వీస్ షాపుల వివరాలు సేకరించి యాప్‌లో పొందుపరుస్తామని, వీటి ద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

అల్లవరం (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న, సూక్ష్మ పరిశ్రమలపై సర్వేలో వివరాలు నమోదు చేయాలని అల్లవరం ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. బుధవారం ఆయన అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శులతో సమీక్షించారు. సచివాలయ సిబ్బంది ద్వారా మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్ ఇమేజ్ సర్వేను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఏవో బి.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, చిక్కం శ్రీనివాస్, సాయిబాబు, పెచ్చెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలి

గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండో పంటలో వరినాట్లు దాదాపు పూర్తయ్యాయని, శివారు భూములకు సైతం సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన పి.గన్నవరం సబ్ డివిజనల్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షుడు తమ పరిధిలోని సభ్యులు, రైతులను సమన్వయం చేసుకుని సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. నీటి ఎద్దడి తలెత్తినచోట క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, వీలుకానిచోట అయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసుకుని సాగునీరు అందించాలన్నారు. లస్కర్లకు జీతాలు సకాలంలో అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి సమస్య కారణంగా అధికారులు సూచించిన వంతుల వారీ విధానాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు క్షేత్రస్థాయిలో పంటకాల్వల్లో మట్టి పూడికతీత, బలహీనంగా ఉన్న పంటకాల్వలు, అవసరమైన చోట రక్షణ గోడలు పనులను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. తొలుత కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తిలకు ఇరిగేషన్ ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస్ బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ డిఈ నాగేంద్రకుమార్, ఏఈ సుందర్‌సింగ్, తాటిపాక నీటి సంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, మానేపల్లి నీటి సంఘం అధ్యక్షుడు మద్దాల తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

15న అయినవిల్లిలో సీజీఆర్‌ఎఫ్ సదస్సు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈపీడీసీఎల్ పరిధిలో సీజీఆర్‌ఎఫ్ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. అయినవిల్లి మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సీజీఆర్‌ఎఫ్ సదస్సు నిర్వహిస్తున్నట్టు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎస్.రాజబాబు తెలిపారు. వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై నేరుగా చైర్‌పర్సన్‌కు, సీజీఆర్‌ఎఫ్ కమిటీకి తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు. విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్‌ఎఫ్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు అందించవచ్చన్నారు. 15న జరిగే సదస్సులో చైర్మన్ సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులైన బి.సులేఖారాణి, షేక్ బాబర్, ఎస్.మురళీకృష్ణ పాల్గొంటారని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి బొంతువారిపేటలోజరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన ఐదు కుటుంబాలను ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. రూ.25వేలు విలువచేసే నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.2వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, నాయకులు నేరేడుమిల్లి సత్యనారాయణ,బీఎస్సార్ ప్రసాద్, సాధనాల సత్యనారాయణ, మంగం సుధాకర్, అంబటి త్రిమూర్తులు, నూకపెయ్యి గంగాధర్, బూల విజయ్, గూటం సాయి, మాకే సిద్దు తదితరులు పాల్గొన్నారు.



కుండలేశ్వరంలో మాఘ పౌర్ణమి వేడుకలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా కుండలేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వృద్ధ గౌతమిలో స్నానాలాచరించి గోదావరి మాత గుడిలో పూజలు చేశారు. అనంతరం శ్రీపార్వతీమల్లేశ్వరస్వామినిదర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎంపీటీసీ అక్కల శ్రీధర్-పావని దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించగా 5వేల మంది భోజనాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి, కనకదుర్గ, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేసినట్టు ఈవో గంగాధర్ తెలిపారు. త్సవటపల్లి నాగు, మీసాల బుల్లియ్య, కనకాలనూకరాజు, కోలా సత్తిబాబు, గంగుమళ్ళ బాబ్జీ, గంగుమళ్ళ భాను, అక్కల ప్రభాకర్‌నాయుడు, చిక్కం అంజిబాబు, అక్కల బ్రహ్మానందం, రవణం పాపారావు, అక్కల నాగమందేశ్వరరావు, జొన్నాడ శ్రీను, సీహెచ్ఎం వర్మ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి (ఆంధ్రజ్యోతి): ~~మహా~~ మాఘి సందర్భంగా బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. లక్ష్మీగణపతి హోమంలో 43 మంది భక్తులు పాల్గొన్నారు. ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు.

హెడ్ కానిస్టేబుల్ కనకరాజు కుటుంబానికి రూ.1.24 లక్షల సాయం

రాజోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఓఎన్జీసీలో ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వరిస్తున్న పొన్నమండ గ్రామానికి చెందిన ఉండ్రు కనకరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడి కుటుంబానికి సిబ్బంది రూ.1.24 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని ఉండ్రు రెడ్డి సమక్షంలో కనకరాజు భార్య శశికళకు ఇచ్చారు. కార్యక్రమంలో కమాండెంట్ డాక్టర్ కె.నరసింహ, అసిస్టెంట్ కమాండెంట్ డీడీ గంగరాజు, ఇన్‌స్పెక్టర్ ఎన్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి’

అంబాజీపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పొందేందుకు ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. మాచవరం, పుల్లేటికుర్రుల్లోని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న కార్యక్రమాలను బుధవారం ఆయన ఏవో సీహెచ్‌డీ విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఏఈవో డి.దుర్గారావు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

దుర్గామాతకు బంగారు నేత్రాల అలంకరణ

అల్లవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అల్లవరం దుర్గాలయంలో కనకదుర్గమ్మవారికి దాతలు రూ.20వేల విలువైన బంగారు నేత్రాలు, ఆంజనేయ, వినాయకుని విగ్రహాలకు వెండి నేత్రాలు బహూకరించారు. దాతలు చేగొండి వినయ్ (మోరిపోడు), కంకిపాటి అరుణ్‌కుమార్ (అల్లవరం) బంగారు నేత్రాలు బహూకరించారు. ఆలయ పూజారి పెద్దింటి వెంకటకృష్ణశాస్త్రి పూజలు చేసి వాటిని అలంకరించారు.



పేకాట శిబిరంపై దాడి: రూ.42,560 స్వాధీనం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాంలో బుధవారం రాత్రి పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,560 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

రాజోలు మండల సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై సర్పంచ్‌లు, కార్యదర్శులు దృష్టి పెట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల్వలు, పంటబోదెల పక్కన చెత్త కుప్పలు, పిచ్చిమొక్కలు, ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులసమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. డ్రైనేజీల్లో పూడికలు తీయాలని, జంగిల్ క్లియరెన్సు చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెండు సంవత్సరాలుగా గౌరవవేతనం రావట్లేదని, వచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్యేకు ఎంపీటీసీలు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, జడ్పీటీసీ మట్టా శైలజ, డ్వామా పీడీ మధుసూదనరావు, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దారు ప్రసాద్, కడలి నీటి సంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, వైస్ ఎంపీపీలు యింటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యామ్‌బాబు, ఏవో ఎం.సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, సర్పంచ్‌లు అడబాల శ్రీనివాసరావు, గిడుగు బుజ్జి, రేవ జ్యోతి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



రాజోలు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సీఎస్సార్ నిధులతో కుర్చీల వితరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు అమలాపురం మెయిన్ బ్రాంచి ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా బుధవారం రూ.50 వేలు విలువచేసే ఆఫీస్ చైర్స్‌ను కొంకాపల్లి జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు అందజేశారు. మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ సందీప్‌కృష్ణ, సీనియర్ మేనేజర్ కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కాశి ఘనసత్యనారాయణ, బీఎన్ వెంకటేశ్వరరావు, పీవీఎల్ఎన్ శ్రీరామ్, ప్రసాద్‌వర్మ, పళ్లాలమ్మదేవి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన స్థానికులు

అల్లవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల మహిళ బుధవారం మధ్యాహ్నం బోడసకుర్రు బ్రిడ్జిపై వడివడిగా నడుస్తూ ఆత్మహత్యా యత్నం చేసింది. దీనిని చూసిన స్థానికులు అడ్డుకుని ఆమెను రక్షించారు. వారిని పోలీసులు అభినందించారు.

మహా కుంభమేళాకు బస్సులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా మహాకుంభ మేళాకు అమలాపురం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుమారు 4వేల కిలో మీటర్లు పైబడి ప్రయాణం చేయాల్సి ఉంటుంది గనుక డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా యాత్రకు అమలాపురం ఆర్టీసీ డిపో ఆరు సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయగా బుధవారం మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ రవికుమార్‌తో కలిసి డీటీవో శ్రీనివాసరావు జెండా ఊపి వాటిని ప్రారంభించారు. డిపో మేనేజరు చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కుంభమేళా యాత్రకు కోనసీమ జిల్లా నుంచే 20 బస్సులను పంపించామన్నారు. అందుకు కృషి చేసిన జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. ~~ఈ నెల 18న మరో~~ రెండు బస్సులు పంపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ గుంగుమళ్ల రామలక్ష్మీదేవి, అసిస్టెంట్ మేనేజరు ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి వరహాలబాబు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి 132కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో సీటీ మార్పుట, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. అమలాపురం పట్టణంతో పాటు అమలాపురం రూరల్, అల్లవరం, అయినవిల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



శ్మశానవాటికలో షెడ్డు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐ.పోలవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్మశానవాటికలో ఒక వ్యక్తి అనధికారికంగా రేకుల షెడ్డు నిర్మించడంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఈవో పి.రవిరాజు ఆధ్వర్యంలో రేకుల షెడ్డును తొలగించారు.

23న యానాంలో ‘వేట కథలు’ సదస్సు

యానాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సాహిత్య అకాడమీ, స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త నిర్వహణలో ‘వేట కథలు’ అంశంపై ఈ నెల 23న సదస్సు నిర్వహించనున్నట్టు ప్రముఖ కవి, స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. యానాంలోని సర్వశిక్షా అభియాన్ హాలులో జరిగే సదస్సులో సాహిత్య అకాడమీ సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం, సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని అధ్యక్షోపన్యాసం చేస్తారు. ముఖ్య అతిథిగా యానాం పరిపాలనాధికారి మునిస్వామి హాజరవుతారు. కవులు రత్నాకర్ పెనుమాక, వరుగు భాస్కరరెడ్డి, వాసిరెడ్డి నవీన్ (అల్లం శేషగిరిరావు కథలు), అవధానుల మణిబాబు (జేపీ వైద్య కథలు), శైలజ, జె.నీరజ (పతంజలి కథలు), మందపర్తి కిశోర్ (పూసపాటి కృష్ణంరాజు కథలు), అద్దేపల్లి ప్రభు (ఇతర రచయిత వేట కథలు) పాల్గొంటారు.



అమలాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు,



మామిడికుదురు మండలం నగరంలో ఎమ్మెల్యే సత్యనారాయణ...



రాజోలు మండలం తాటిపాకలో ఎమ్మెల్యే వరప్రసాద్...

పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. బుధవారం ఆయన రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కర్రోతు బంగార్రాజుతో కలిసి పట్టణ పరిధిలోని 13, 14, 15 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నాయకులు కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, తిక్కిరెడ్డి నేతాజీ, పెచ్చెట్టి విజయలక్ష్మి, గెల్లా మీనాకుమారి, వలవల శివరావు, ఎండీ బషీర్, కుంచే రమేష్, కర్రి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. బుధవారం ఆయన కూటమి నాయకులతో కలిసి నగరం గ్రామంలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పి.గన్నవరం అబ్జర్వర్ షేక్ సుభాన్, సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, గుబ్బలదుర్గ నాయకులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి దుర్గారామకృష్ణ, బోనం బాబు, దొంగ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం రాజోలులో ప్రారంభించారు. సోంపల్లి, పొదలాడ, తాటిపాక గ్రామాల్లో ఇంటింటా తిరిగి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ రాజోలు మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, అడబాల విజయ్, పినిశెట్టి బుజ్జి, కోళ్ల బాబి, సర్పంచ్‌లు కోటిపల్లి రత్నమాల, కడలి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, గుండాబత్తుల తాతాజీ పాల్గొన్నారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు కోరారు. బుధవారం ఆయన ఎస్ఎస్ఎం కళాశాలలో ఉపాధ్యాయులను కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. మందా రాజేష్, నిమ్మకాయల శేషు, నేదునూరి రాజకుమార్, గణేష్ పాల్గొన్నారు.

ఐ.పోలవరం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా ఆయన సతీమణి సత్యవాణి బుధవారం స్వగ్రామం జి.వేమవరంతో పాటు కాకినాడ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో గ్రాడ్యుయేట్లను కలిసి తన భర్త విజయానికి సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యులు,బంధువులతో కలిసి ఆమె ప్రచారం చేశారు.పెంట రవి, పెంట కవిత, పెంట శివరామకృష్ణ, చోడిశెట్టి బ్రహ్మానందం, మింగి కృష్ణ, సలాది శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఐ.పోలవరం మండలంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి రాజశేఖరం సతీమణి సత్యవాణి

విద్యార్థులకు టాయిలెట్ల నిర్మాణం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఐడీబీఐ నిధులు రూ.1.50లక్షలతో కార్పొరేట్ స్థాయి మరుగుదొడ్లు నిర్మించినట్టు హెచ్ఎం నూకల సత్యనారాయణ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి నాగులపల్లి ప్రకాష్ ద్వారా నిధుల సమీకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, రీజనల్ హెడ్ బ్రాంచ్ మేనేజర్ దేవదాస్, ఎంపీటీసీలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయలు

యానాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యానాం శివారు దరియాలతిప్ప సమీపంలో ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సావిత్రినగర్ నుంచి యానాం వస్తున్న ఆటో దరియాలతిప్ప వద్ద బోల్తా పడడంతో ఐదుగురు గాయపడ్డారు. వారికి స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య నిమిత్తం కాకినాడ తరలించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి గ్రామానికి చెందిన కొత్వాల రాజేష్ (26) గత ఏడాది డిసెంబరు 17 నుంచి కనిపించట్లేదని తండ్రి అప్పారావు అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు పట్టణ ఎస్ఐ తిరుమలరావు బుధవారం తెలిపారు. రాజేష్‌కు ఆరేళ్ల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



రాజేష్ (పాత చిత్రం)

‘విధిగా హెల్మెట్ ధరించాలి’

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీటీవో డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కామనగరువు ఆదిత్య పాఠశాలలో రహదారి భద్రతపైప్రిన్సిపాల్ రాంప్రసాద్ అధ్యక్షతన బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీటీవోతో పాటు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. వాహనాలపై ప్రయాణించేటప్పుడు సీటుబెల్టు ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ఒకవేళ ఎవరైనా అలా నడిపితే వారి తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. రహదారి భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఆర్ రవికుమార్, పీజే సురేష్‌బాబు, ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌వీఎస్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమలాపురంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రావులపాలెం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మొగలికుదురు శ్రీచైతన్య స్కూలులో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో రోడ్డు భద్రతా నిబంధన ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతా నిబంధన అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఐరాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి, అకడమిక్ డీన్ రమేష్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ‘విక్టరీ’ విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించినట్టు కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ద్రాక్షారపు సాత్విక్ ఓపెన్ కేటగిరీలో రూ.3వేలు నగదు బహుమతి సాధించాడు. అండర్-15 విభాగంలో బండారు నానిబాబు, అండర్-11 విభాగంలోజాన్‌బ్లెస్సీ ప్రథమ స్థానాల్లో నిలిచి రూ.2వేలు చొప్పున నగదు బహుమతితో పాటు స్వర్ణ పతకాలు అందుకున్నారు. అండర్-13 విభాగంలో ఫణిశెట్టి అవినాష్ ద్వితీయ స్థానంలో నిలిచి నగదు బహుమతితో పాటు రజత పతకం సాధించాడు. విజేతలకు గుంటూరు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రరాజు బహుమతులు అందించి అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

సీపీఐ శత వసంతోత్సవాల నిర్వహణకు నిర్ణయం

మలికిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో రాజోలు నియోజకవర్గవ్యాప్తంగా శత వసంతోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. బుధవారం దిండిలో జరిగిన ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ విస్తృత సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ ప్రజలందరూ లౌకిక రాజ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ పేదలకుమూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహ నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, దేవ సురేష్‌బాబు, చెల్లుబోయిన తాతారావు, గెడ్డం ప్రభాకరరావు, నల్లి బుజ్జిబాబు, దీపాటి గంగాచలం, మేడిచర్ల సత్యనారాయణ, పుల్లెల ఆనంద్, పెద్దిరెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి పట్టు

యానాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం స్పీకర్ సెల్వం అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగింది. పలు అంశాలను చర్చించి ఆమోదం తెలిపారు. స్పీకర్‌పై ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలని, అప్పటివరకు డిప్యూటీ స్పీకర్‌తో అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించాలని స్వతంత్ర ఎమ్మెల్యే నెహ్రూ డిమాండ్ చేయడంతో గందరగోళం నెలకొంది. దీంతో నెహ్రూను స్పీకర్ సస్పెండ్ చేశారు. పుదుచ్చేరిలో కొత్త మద్యం ఫ్యాక్టరీల ఏర్పాటును అసెంబ్లీ ఆవరణలో బీజేపీ ఎమ్మెల్యేలు జాన్ కుమార్, కల్యాణసుందరం, రిచర్డ్‌జాన్‌తో పాటు బీజేపీ మద్దతు ఇచ్చిన స్వతంత్ర ఎమ్మెల్యేలు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, అంగళన్, శివశంకర్ వ్యతిరేకించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.3.30 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,30,512 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గన్నవరం మండలం వీరపనేని గూడెంనకు చెందిన బి.నాగశివ లిఖిత కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

క్యూలైన్ల విస్తరణ పనులు: వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని క్యూలైన్ల విస్తరణ పనులు చేపట్టారు. వేదాశీర్వచనం, శీఘ్రదర్శనం, వీఐపీ దర్శనం క్యూ లైన్లను స్టీల్ రైలింగ్‌తో విస్తరించారు. వీటి పనులను ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించి పలు సూచనలు చేశారు. రానున్న వేసవి దృష్టిలో పెట్టుకుని టెంట్లు వేసి ఎండవేడి నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టారు. ఆలయంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు.



క్యూలైన్ల విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు





పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు. పక్క చిత్రంలో పీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు

రాయవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపారు. తొలుతగా విజయవేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు , భవాని శంకరసమేత అష్టలింగేశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మాఘ పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఈకార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ , భక్తులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మాఘ పౌర్ణమి పూజలను భక్తులు ఘనంగా జరిపారు. పామర్రు పుట్టాలమ్మ ఆలయంలో పలువురు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు లలితా సహస్రనామాలు పఠించారు. పుట్టాలమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అముజూరు బాలా త్రిపుర సుందరీదేవి పీఠంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



పామర్రు పుట్టాలమ్మ ఆలయం వద్ద లలితా సహస్రనామాలు పఠిస్తున్న మహిళలు

జేఈఈ మెయిన్స్‌లో ఆలమూరు విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆలమూరుకు చెందిన నెక్కంటి సాకేత్ 99.99 శాతం, సంధిపూడి గ్రామానికి చెందిన తోట మెహన్ నాగ వీర వెంకటరాజు 99.77 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను పలువురు అభినందించారు.

కిక్ బాక్సింగ్ విజేతకు ఎమ్మెల్సీ అభినందన

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో జరిగిన వాకో ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ కనబరచి రెండు పతకాలు కైవసం చేసుకున్న క్రీడాకారిణి అమృతహాసిని బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందించారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీతో పాటు, వైస్ ఎంపీపీ శాకా బాబి, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, మాజీ ఉపసర్పంచ్ తోట శ్రీను, బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, గ్రామస్తులు సత్కరించారు.



అమృతహాసిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట

తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం రామచంద్రపురంలో ఎస్ఆర్‌కె జానకిదేవి తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 16వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి ప్రారంభించారు. క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 180 మంది క్రీడాకారులు హాజరైనట్లు కోచ్, ఇన్‌స్ట్రక్టర్ ప్రసాద్‌రాయల్ తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్ శ్రీదేవి, వాసంశెట్టి సత్యం

విద్యార్థులకు కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, పది పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆదర్శ అకాడమీ చైర్మన్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. పరీక్షల్లో ఒత్తిడికి గురయ్యే వారికి ఉచిత కౌన్సెలింగ్‌ను బుధవారం ప్రారంభించామన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇది కొనసాగుతుందన్నారు.

అన్నదాతకు సాగునీటి కష్టాలు

• పంట కాలువల్లో గుర్రపు డెక్క, తూడుతో మూసుకుపోయిన వైనం • పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దాళ్వా పంటకు పుష్కలంగా సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు సాగునీటి పంపిణీలో వంతులవారీ విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు అందే పరిస్థితి కానరావడం లేదు. పంట కాలువలు మూసుకుపోవడంతో రైతులకు సాగునీరు వెళ్లే పరిస్థితిపై వారిలో ఆందోళన నెలకొంది. పేరవరం ఎత్తిపోతల పథకం పరిధిలోని రాజవరం, వెలిచేరు, కట్టుంగ, పులిదిండి, వసంతవాడ గ్రామాల మీదుగా వెళ్లే పంట కాలువలు గుర్రపుడెక్క, తూడుతో మూసుకుపోయి సాగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడుతోంది. ఉచ్చిలి పంపింగ్ స్కీమ్ ద్వారా ఆత్రేయపురం, వాడపల్లి, మెర్లపాలెం వెళ్లే పిల్లకాలువలు, గుర్రపుడెక్క, తూడుతోమూసుకుపోయాయి. సాగునీరు ముందుకు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలువలను పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. రైతు సంక్షేమానికి గత ప్రభు త్వం ఏ విధమైన చర్య లు చేపట్టకపోవడంతో రైతులు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. వర్షాకాలంలో అయితే పంట పొలాల్లోని ముంపునీరు ముం దుకు కదలక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని గుర్రపుడెక్క, తూడును తొలగించాలని రైతులు కోరుతున్నారు



ఆత్రేయపురం మండలం పులిదిండి పంట కాలువలో గుర్రపుడెక్కతో మూసుకుపోయిన దృశ్యం



స్వామివారికి చక్రస్నానం చేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో జనార్దనస్వామి చక్రస్నానం

మండపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) మండపేటలోని రథంగుడిలోనున్న జనార్దన స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. తొలుత స్వామివారిని రథం గుడి నుంచి పల్లకీలో ఊరేగింపుగా పెద్దకాల్వ వంతెన వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం చక్రస్నానం జరిపారు. కార్యక్రమంలో ఖండవిల్లి రాధా కృష్ణమాచార్యులు తనయుడు పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఖండవిల్లిగోపాల కృష్ణామాచార్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి కామేశ్వరరావు, అర్చకస్వాములు ఖండపల్లి పవన్, భార్గవ్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి గరుడ వాహనసేవ

రాయవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం గరుడ వాహన సేవ నిర్వహించారు. మాఘమాసంలో జరిగే వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేణుగోపాలస్వామికి అమ్మవార్లకు తులసిదళ అర్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గంధం సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది పెమ్మాడి వెంకటేశ్వరరావు , పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జనార్దనస్వామి చక్రస్నానం

ఆలమూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు నవజనార్దనస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి పెద్దకాలువ వరకు స్వామివారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కాలువ వద్ద స్వామివారికి ఆలయ అర్చకులు అంగర భగవాన్, ఖండవల్లి ప్రభాకరాచార్యులుల అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలువలో చక్రస్నానం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ, జేపీ పవన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశూల పూజ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పడమరఖండ్రికలో ఖండేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం త్రిశూలపూజ, వాహన ఊరేగింపు జరిగింది. కొమార్ళపల్లి శ్రీనివాసరాంగోపాల్ బ్రహ్మత్వంలో శ్రీకంఠం అమ్మన్న పంతులు ఆధ్వర్యంలో ఉదయం త్రిశూలపూజ, కంకణ విసర్జన, పూర్ణాహుతి తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. గురువారం ద్వాదశప్రదక్షిణల అనంతరం స్వామివారి పుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో రాంబాబు రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ బీజేపీ కమిటీని బుధవారం ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడు దునే శ్రీనివాస్ అధ్యక్షతన కేశవ రాఘవేంద్రరావు స్వగృహంలో సమావేశం జరిపి నూతన కమిటీ ప్రకటించారు. అధ్యక్షుడిగా దునే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కులపాకల వెంకట రమణ, ఖండవిల్లి సత్యనారాయణ, చొల్లంగి రాంబాబు, వడ్డాది నాగార్జున, కొనపాల గణేష్, అనుపోసు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శులుగా మాధవభట్ల కృష్ణమూర్తి, కొప్పిశెట్టి శ్రీను, కార్యదర్శులుగా అంకం ధనరాజు, పిలుకానా లక్ష్మీభార్గవి, కొనపాల రేవతి, అనంతలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, కె.ఆదిత్య, గుండుబోగుల ప్రసాద్‌లను ప్రకటించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా నియోజకవర్గ కోకన్వీనర్ సలాది శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు యాండ్ర బుల్లబ్బులు, కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో జరిగిన టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలి'

మండపేట, ఫిబ్రవరి, 12(ఆంధ్రజ్యోతి) ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం బీఎల్ఏలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కూటమి నేతలు సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. బుధవారం కొత్తపేటలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బులుసు భాస్కరరావు, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ, ముద్రగడ ఫణి, కుడుపూడి శ్రీను, ఆనాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మడికిలో బుధవారం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. టీడీపీ నియోజకవర్గ యువ నాయకుడు బండారు సంజీవ్ అధ్వర్యంలో నాయకులు రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు దొండపాటి సుబ్బ రాజు, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, సలాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అవరోధాలు అధిగమించేందుకు కృషి

కె.గంగవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు నీటి సరఫరాలో అవరోధాలు అధిగ మించేందుకు అధికారులతో సమష్టి గా పని చేయాలని నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులు నిర్ణయించారు. బుధవారం కోటిపల్లిలో ఇరి గేషన్ కార్యాలయం ఆవరణలో నీటి పం పిణీ సంఘాల అధ్యక్షుల సమా వేశం జరిపారు. సమావేశంలో ప్రస్తుతం రబీ పంటకు నీటి సరఫరా స్థితిపై చర్చించారు. కార్యక్రమంలో డీసీ అధ్యక్షులు మెర్ల గోపాల స్వామి (ఆలమూరు), మేకా శివప్రసాద్ (కూళ్ల), దాట్ల విజయగోపాల్ రాజు(కోటిపల్లి), వి. భాస్కర రాజు (తాళ్లరేవు), నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వర రావు (యర్రపోతవరం), కోట నీటి సంఘం అధ్యక్షులు ములకల విశ్వేశ్వరరావు, కూళ్ల నీటి సంఘం అధ్యక్షులు ఎనుమల గోపాలకృష్ణ (చిట్టిబాబు) ఆయా డీసీల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు

హైకోర్టు ఆదేశాలతో దివ్యాంగుల సర్వే

ఆలమూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో దివ్యాంగులు, చిన్నారుల సర్వే నిర్వహించారు. ఆలమూరులో బుధవారం జరిగిన సర్వేలో ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి నాగేశ్వరరావు నాయక్ ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ మండల ప్రత్యేకాధికారి న్యాయవాది కె.ధనరాజు నేతృత్వంలో కోర్టు, వైద్య ఆరోగ్య, ఆశ, పంచాయతీరాజ్ సిబ్బంది ఆలమూరులో సర్వే జరిపారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు ఉన్న దివ్యాంగులు, అప్పుడే పుట్టిన చిన్నారులు, ఆరునెలలోపు ఉన్న వారి వివరాలను సేకరించారు. ఆలమూరు కోర్టు పరిధిలోని ఆలమూరు, మండపేట రూరల్, మండపేట టౌన్, కపిలేశ్వరపురం మండలాలలో సర్వే జరుగుతున్నదని ఆయన చెప్పారు.



దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది తదితరులు



ప్రైవేట్ విద్యా సంస్థల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న గన్నికృష్ణ

వైసీపీ పాలనలో విద్యా రంగానికి గడ్డు పరిస్థితి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విద్యా రంగం గడ్డు పరిస్థితి ఎదుర్కొందని విద్యా రంగాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ విమర్శించారు. బుధవారం రామచంద్రపురంలో మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో ప్రైవేటు విద్యా సంస్థల యజమానుల, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్న రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ పొర్లుదండాలు

రావులపాలెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో శివస్వాముల ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ పొర్లు దండాల కార్యక్రమం జరిపారు. మార్టేరుకు చెందిన పొర్లుదండాల స్వామి కొవ్వూరి విజయషణ్ముఖరెడ్డి ప్రజలు ఆనందంగా ఉండాలని, సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ గ్రామంలోని రహదారిపై 5 కిలోమీటర్ల మేర పొర్లు దండాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొలుగూరి వెంకటరెడ్డి, సూరిబాబు, ఎస్‌వీఆర్ కృష్ణారెడ్డి, గురుస్వామి భుజంగ రామారెడ్డి, శివస్వాములు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందిన బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు అయ్యాయి. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలకు చెందిన 20 మందికి మంజూరైన రూ.18,60,566 చెక్కులను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల బాధితులకు అందించారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి

కె.గంగవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని విజయవాడ పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కుడుపూడి నాగ మోహన్ రావు అన్నారు. బుధవారం ఆయన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. జన్మభూమిపై ఉన్న మమకారంతో తన తండ్రి నరసన్న లైన్‌మెన్‌గా పనిచేసిన పామర్రు, కె.గంగవరం తదితర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలకు వివిధ రకాల పండ్ల జాతి మొక్కలు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, చిల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రక్కి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో రాజు

చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కృషి

ఆలమూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నదని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఇందులో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రతి గ్రామంలో ఇంటింటా ఎంఎంఎస్ఎంఈ సర్వే జరుగుతున్నదని తెలిపారు. ఆలమూరులో బుధవారం ఎంఎస్ఎంఈ సర్వేలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గనిపోతురాజు ఆదాయం లెక్కింపు

మండపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) కేశవరంలోనున్న గనిపోతురాజుస్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లు రాజు, కార్యవర్గ సభ్యులు, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో జరిగి లెక్కింపులో రూ.6.34 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. మూడు నెలల పదిహేను రోజుల ఆదాయాన్ని లెక్కించినట్టు ఆయన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మండపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో కంటి పరీక్షలతోపాటు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో పరీక్షల అనంతరం చికిత్స అవసరమైన వారికి కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రిలో వైద్య సేవలు అందించి చికిత్సలు చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కెఎస్ఆర్ శంకర్, గోపాల్, డాక్టర్ నాయక్, డాక్టర్ మధు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

విజేతలకు బహుమతుల పంపిణీ

రావులపాలెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బండారు బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, పడాల బులికొండారెడ్డి, చిన్న కేవీ, సిద్ధిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్పీడీపీ సర్వేలో 14 కొత్త కేసులు

కె.గంగవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే ఎల్పీడీపీలో 14 కొత్త కేసులు గుర్తించినట్టు స్పర్శ ప్రోగ్రాం జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం దంగేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్పర్శలో భాగంగా ఆశవర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ఆమని, సిబ్బంది గుడాల శ్రీమన్నారాయణ, సూర్యారావు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.